అవ్వాతాతలను మురి'పింఛన్'

- సెప్టెంబర్‌లోనే రెండు విడతల్లో కొత్త పింఛన్ల పంపిణీ
- 1,752 మందికి కొత్త పింఛన్లు మంజూరు
- 40,069కి చేరిన లబ్ధిదారుల సంఖ్య

ఆళ్లగడ్డ : కులం, మతం రాజకీయాలతో పనిలేదు.. నాయకులు.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు. గత ప్రభుత్వంలో వలే జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లు పట్టుకొని ప్రాధేయ పడాలన్న బాధ అంతకంటే లేదు. అర్హతే ప్రామాణికం .. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న మహోత్తర లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పేరుతో నాలుగేళ్లుగా ఇంటిముంగిటికే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తోంది. ప్రతి ఆరునెలలకు ఒకసారి అర్హులై ఉండి సంక్షేమ ఫలాలు అందని వారి కోసం గాలించి మరీ మరీ అందిస్తోంది. తాజాగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి, అర్హత ఉన్న చిన్న చిన్న సాంకేతిక సమస్యలతో పథకాలను అందని వారిని వలంటీర్లు, గృహసారథులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1,752 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసి వారిలో సంతోషాన్ని నింపింది.


కోటకందుకూరులో కొత్త లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

మరో మూడు నెలల్లో రూ.3వేలు పింఛన్..

పది రోజులు ముందుగానే పింఛన్ దారులకు వినాయక చవితి పండుగొచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకు పింఛన్‌దారులకు ఇస్తున్న నెలవారీ పింఛన్ రూ 2,000 నుంచి పెంచుతూ ప్రస్తుతం రూ. 2,750 అందజేస్తున్నారు. మరో మూడు నెలల్లో ఫించన్ కానుక రూ 3000 కు పెరగనుంది.

రెండు విడుతల్లో 1,752 పింఛన్లు మంజూరు

పింఛన్ల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటిస్తోంది. దరఖాస్తు చేసుకుంటే చాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటోంది. ఈ నెలలోనే రెండు విడతల్లో నూతన పింఛన్లు మంజూరు చేసింది. సెప్టెంబర్ ఒకటవ తేదీ తొలి విడతగా 841 కొత్త పింఛన్లు మంజూరు చేయగా ఈ నెల 12వ తేదీ మరో విడత 911 మంజూరు చేసి మొత్తం 1,752 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేసి లబ్ధిదారుల్లో ఆనందం రెట్టింపు చేసింది. ప్రజా ప్రతినిధులు పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. గతంలో 38,317 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 40,069 చేరుకుంది. ఈ నెలలో మొత్తం రూ 12.20 కోట్లు పంపిణీ చేశారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక వివరాలు

మండలం	వితంతు	వృద్ధాప్య	దివ్యాంగ	చర్మ కళాకారులు	డప్పు	ఒంటరి మహిళ	ఇతరులు	మొత్తం
ఆళ్లగడ్డ	71	120	18	29	8	00	5	237
చాగలమర్రి	110	219	49	3	2	00	4	387
దొర్నిపాడు	66	83	22	7	5	00	2	185
రుద్రవరం	123	172	38	9	5	00	20	367
శిరివెళ్ల	116	148	52	23	3	00	3	345
ఉయ్యాలవాడ	56	108	27	16	3	01	6	217
మొత్తం	542	850	206	87	26	01	40	1752

ఎంతో సంతోషంగా ఉంది



నాలుగు నెలల క్రితం నా భర్త దూరమవ్వడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. నా పరిస్థితి గమనించిన వలంటీర్ తనే మా ఇంటికి వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేసుకోమని చెప్పారు. సచివాలయం వెళ్లి దరఖాస్తు చేసుకోగా బుధవారం ఇంటికి వచ్చి పింఛన్ మొత్తం రూ 2,750 అందించారు. ఇదే కదా ప్రజలు కోరుకునేది. ఎవరి సిఫారసు లేకుండా, ఆఫీసుల చుట్టూ తిరగకుండానే పింఛన్ ఇంటి దగ్గరకు వచ్చి అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. – రమణమ్మ, ఉయ్యాలవాడ

దివ్యాంగ పింఛన్ మంజూరు చేశారు..



మేము కూలి పనులు చేసుకుని జీవించేవారం. పుట్టుకతోనే దివ్యాంగురాలిని సరిగా నడువలేను, మాట్లాడలేను అయినప్పటికీ సదరం క్యాంపులో సర్టిఫికెట్ ఇవ్వడానికి కుదరదని ఏవేవో చెప్పేవారు. నెల క్రితం వలంటీర్ అధికారులను ఇంటి దగ్గరకు పిలుచుకు వచ్చి పింఛన్ రాలేదని నన్ను చూపించాడు. అధికారులు అందరూ చర్యలు తీసుకుని సర్టిఫికెట్ తెప్పించి రూ 3 వేల పింఛన్ మంజూరు చేశారు. ఊహ తెలిసినప్పటి నుంచి పింఛన్ కోసం ఎదురు చూసి.. ఇక రాదు అనుకున్న పింఛన్ మంజూరు చేసి మా కుటుంబానికి చేదోడుగా నిలిచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు . – నాగజయంతి, క్రిష్టిపాడు

అర్హతే ప్రామాణికం



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అందిస్తోంది. ఇందులో ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతోంది. వలంటీర్ ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో లబ్ధిదారుల సంఖ్య ఎలా తగ్గించాలా అని ఆలోచించేవారం. ఇప్పుడు ఒక్క నెలలోనే సుమారు 11 వేల మందికి కొత్తగా వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరు చేయడం విశేషం. ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులను గుర్తిస్తూనే ఉన్నాం. ఇది నిరంతర ప్రక్రియ. – శ్రీధర్‌రెడ్డి ,పీడీ, డీఆర్‌డీఏ

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మకు అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరద ఉధృతి తగ్గుముఖం


క్రిష్టిపాడు వద్ద ప్రవహిస్తున్న కుందూనది

దొర్నిపాడు: గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కందూనది ఉధృతంగా ప్రవహించింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో నీటి ప్రవాహం తగ్గడంతో నీటి ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో క్రిష్టిపాడు గ్రామంలోని రైతులకు కుందూనదిపై ఉన్న వంతెనపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. కుందూకింద సాగుచేసిన వరి, జొన్న, మిరప పంటలకు సాగునీటి కష్టాలు ఉండవని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఎంఈఓ–2లకు అడ్డంకులను తొలగించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి బోధనలో స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని, జీపీఎస్ వల్ల ఉపయోగం లేదని, ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సమావేశంలో విజయరావు, సురేష్‌కుమార్, షడక్ బాబు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా జగనన్న సురక్ష సర్వే

ఉయ్యాలవాడ : ప్రజా ఆరోగ్యం ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో వేగవంతంగా కొనసాగుతోంది. గ్రామ వలంటీర్లతో కలిసి ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇంజేడు, బోడెమ్మనూరు, అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో గృహాల వద్దకు వెళ్లి ఆరోగ్య వివరాలను సేకరిస్తూ నమోదు చేస్తున్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు రమేష్ చంద్రబాలాజీ, రాబర్ట్ కెనడీ, శివలింగమ్మ, విజయదుర్గ వెల్లడించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ రహదారిలో నడిచే ఆర్టీసీ బస్సుల ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం నుంచి ప్రయాణికులకు గిఫ్ట్‌స్కీం అమల్లోకి వస్తుందన్నారు. ఆ రూట్‌లో ప్రయాణం చేసిన ప్రయాణికులు టికెట్ వెనుక పేరు, అడ్రస్, ఫోన్ నంబర్ రాసి ఆయా బస్సుల్లో ఉంచిన గిఫ్ట్ బాక్స్‌ల్లో వేయాలన్నారు. ప్రతి నెలా 15వ తేదీన డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు.

మురుగు కాల్వలు శుభ్రం



మురుగు కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

చాగలమర్రి: మండల కేంద్రంలోని మొయిన్ బజార్‌లో మురుగు కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు పేరుకుపోవడంతో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఆదివారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను తొలగించి కాలువను శుభ్రం చేయడంతో నిలిచి ఉన్న నీరు కాలువల ద్వారా బయటికి వెళ్లిపోయింది.

రాజ్యాంగాన్ని కాపాడే వారినే ఎన్నుకుందాం

నంద్యాల(న్యూటౌన్): రాజ్యాంగాన్ని, లౌకికత్వాన్ని కాపాడే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని తీర్మానించినట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఎస్‌డీపీఐ కార్యదర్శి జనాబ్ ఫాజిల్ దేశాయ్ తెలిపారు. ఆదివారం శ్రీరామకృష్ణ వివేకానంద ఆడిటోరియంలో 'నేటి దేశ పరిస్థితులు– మన బాధ్యతలు' అన్న అంశంపై లౌకిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటు హక్కుతో మాత్రమే వ్యవస్థలో మార్పు సాధ్యమన్నారు. నాయకులు అబుల్లైజ్, సుభాన్, అమీర్, అబ్దుల్‌సమ్మద్, క్రిష్టియన్ జేఏసీ మోహన్, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు 250 క్యూసెక్కుల నీరు


కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకీన్స్‌లా నుంచి తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్ (కేసీ కెనాల్)కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆదివారం ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ప్రస్తుతం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి మాత్రమే పంపుల ద్వారా కేసీ కెనాల్‌లోకి కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కాగా లాకీన్స్‌లా వద్ద నిప్పుల వాగు, అలగనూరు రిజర్వాయర్ లకు గేట్లు పూర్తిగా మూసి వేశామని, కేవలం తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు మాత్రమే నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు వివరించారు.

బీజేపీ నాయకుల రక్తదానం

నంద్యాల(వ్యవసాయం): ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకొని నంద్యాల భారతీయ జనతాపార్టీ నాయకులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల పది మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన కార్యకర్తలకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంటి ఆదినారాయణ, గంగాధర్, శివశంకర్‌గౌడ్, శివారెడ్డి, ప్రసాదరాజు, కశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస్ సేవలు మరువలేనివి

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలవికాస్ కేంద్రం సేవలు మరువలేనివని ఫౌండేషన్ నగర కన్వీనర్ చింతలపల్లె వాసు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌నగర్ బుడగజంగాల కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దేవాలయాన్ని పరిశీలించారు. అనంతరం బాలవికాస్ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సనాతన ధర్మం, సంప్రదాయాలను పాటించి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, దేవాలయ పూజారి ఎల్లప్ప, మౌలాలి, సుంకన్న పాల్గొన్నారు.

రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయండి


మందలూరు వద్ద సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

రుద్రవరం: జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆర్‌డీఓ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని మందలూరు, చిలకలూరు గ్రామాల్లో సాగుతున్న రీ సర్వే, హద్దుల్లో రాళ్లు పాతే కార్యక్రమాన్ని, మందలూరు సచివాలయం వద్ద పాతేందుకు సిద్ధంగా ఉన్న రాళ్లను ఆదివారం పరిశీలించారు. ఆర్‌డీఓ తెలిపిన వివరాల మేరకు.. మందలూరులో 1,380, చిలకలూరులో 1,350 సర్వే నంబర్లు ఉన్నాయి. కొద్ది రోజులుగా వీఆర్వో, సర్వేయర్లు కలిసి హద్దులు గుర్తిస్తూ రాళ్లను వేస్తున్నారు. కార్యక్రమాన్ని వివాదాలు లేకుండా రైతులకు అవగాహన కల్పిస్తూ త్వరగా పూర్తి చేయాలని మండల రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రప్రసాదు సిబ్బంది ఉన్నారు.

30 నుంచి శౌర్య జాగరణ యాత్ర

నంద్యాల(వ్యవసాయం): విశ్వ హిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పోలేపల్లి సందీప్ తెలిపారు. ఆదివారం భరతమాత దేవాలయంలో యాత్రకు సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లను జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. హిందూ యువతలో దేశభక్తి, దైవభక్తి నింపడం, మన ప్రాంతంలోని స్వాతంత్ర్య పోరాట వీరులను నేటి యువతకు గుర్తు చేయడం, మత మార్పిడులు అరికట్టడం, హిందూ కన్యా రక్ష మొదలగు లక్ష్యాల సాధన కోసమే ఈ యాత్ర యోజన చేశారని చెప్పారు. జాగరణ యాత్ర ఈ నెల 30న అహోబిల పుణ్యక్షేత్రం నుంచి మొదలై జిల్లాలోని అన్ని మండలాల్లో యువతను జాగృతం చేస్తూ దాదాపు 60కి పైగా చిన్న, పెద్ద సమావేశాలు నిర్వహిస్తూ అక్టోబర్ 14న నంద్యాలలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల నగర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, లింగేశ్వర బాబు, కమ్మయ్య, వరప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలదేవస్థానం ఉద్యోగుల అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 13 మంది అంతర్గత బదిలీలను చేస్తూ ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ప్రధానంగా స్వామివారి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.దివాకర్‌రెడ్డిని జి–2, ఎల్–1 సీట్ కు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ లోకేశ్వరప్పను స్వామివారి టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ డి.బాలకార్తిక్ గౌడ్ ను డీసీబి విధులకు కేటాయించారు. అలాగే పలువురు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ ,అటెండర్, ఒప్పంద సిబ్బంది, డైలీ వేజర్స్ సిబ్బంది మొత్తం 13 మంది సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరాలని ఈఓ పేర్కొన్నారు.

మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ


తెలంగాణ చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్‌సెక్రటరీ శాంతి కుమారి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివార్లకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఉయ్యాలవాడ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదనపు కట్నం కోసం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తస్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని హరివరం గ్రామానికి చెందిన కొలిమి హసీనాకు బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాతో 2019లో వివాహం చేశారు. అప్పట్లో కట్నకానుల కింద ఐదు తులాల బంగారు, రూ.50వేల నగదు ముట్టజెప్పారు. అయితే నాలుగేళ్ల నుంచి సంతానం కలుగలేదనే నెపంతో అదనపు కట్నం తీసుకు రావాలని, లేకుంటే రెండో వివాహం చేసుకుంటానని భర్తతో పాటు అత్త హుసేన్‌బీ, ముగ్గురు ఆడపడుచులు మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని హసీనా పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

చెంచుగిరిజనులకు ఉచిత వైద్యసేవలు

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెర్వు గూడెంలో సంఘమిత్ర సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసూతి వైద్యాధికారి బాలకృష్ణవేణి, మన్మథ్ గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ గిరిజనులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సమీపంలోని ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం 170 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సునిత, మాధవి, వసుధరాణి, హరీష, సంఘమిత్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

లింగాలగట్టు వద్ద ట్రాఫిక్‌జాం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాల గట్టు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. లింగాలగట్టు గ్రామంలో మత్స్యకారులు హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారికి పక్కనే చేపలు విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌జాం అవుతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు, మత్స్యశాఖ అధికారులు ఎన్ని మార్లు మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రోడ్లకు ఇరువైపున చేపల విక్రయం కొనసాగిస్తుండడంతో వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు. శ్రీశైలానికి శని,ఆది, సోమవారాల్లో భక్తులు తమ వాహనాల్లో భారీగా వస్తుంటారు. చేపల విక్రయంతో లింగాలగట్టులో ట్రాఫిక్ జాం సమస్య పరిపాటిగా మారింది.

పొంగిపొర్లిన పాలేరు వాగు


భక్తులను వాగు దాటిస్తున్న యువకులు

మహానంది: మహానంది–గాజులపల్లె మార్గంలోని పాలేరువాగు ఆదివారం మరోసారి పొంగి ప్రవహించింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నల్లమలలోని నీరు పాలేరువాగులో చేరుతోంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల సమీపంలో ఉన్న పాలేరు ఉధృతి అధికం కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు తెలియక ఈ మార్గంలో వెళ్లి ఇరుక్కుపోగా, కి వీవీఆర్ యూత్ సభ్యులు పాలేరు వాగు వద్దకు చేరుకుని సేవలు అందించారు. ప్రయాణికులను, వారి వాహనాలను సురక్షితంగా దాటించి అందరిచేత మన్ననలు పొందారు.

విజయ డెయిరీ సబ్సిడీ చెక్కుల పంపిణీ


నందివర్గం యేస్వేరమ్మ సెంటర్‌కు చెక్కులను అందిస్తున్న యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు

బనగానపల్లెరూరల్ : బనగానపల్లె విజయ డెయిరీ యూనిట్ పరిధిలోని పాడి రైతులకు సబ్సిడీ చెక్కులను యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు ఆదివారం అందజేశారు. మండలంలోని నందివర్గం యేస్వేరమ్మ సెంటర్‌లోని ఇద్దరు మహిళా రైతులు పశువులను కొనుగోలు చేయడంతో సంస్థ 20 శాతం రాయితీకి సంబంధించి రూ.32వేల చెక్కు అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని జుబేదా సెంటర్‌కు సంబంధించి సంస్థ అందజేయు పశుగ్రాసం సబ్సిడీ ఎకరానికి రూ.5వేల చొప్పున ఎనిమిది మంది పాడి రైతులకుగాను మొత్తం రూ.17,500 చెక్కులు అందజేశారు. గుండ్లశింగవరం, అన్నవరం గ్రామాలకు చెందిన ఐదు మంది రైతులు పశువులు కొనుగోలు చేయగా రాయితీ మొత్తం రూ.79,900 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు కె.లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలరాజు, జూబేదాబీ, రైతులు పాల్గొన్నారు.

కుందూకు నీరు.. చిగురించిన ఆశలు


ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల మధ్య కుందూ నది ప్రవాహం

ఉయ్యాలవాడ : ఈ నెల ప్రారంభం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని కుందూనదిలో పది అడుగులకు తగ్గకుండా నీరు ప్రవహిస్తూ వుంది. ఎగువ నుంచి నదికి నీరు విడుదల కొనసాగుతోంది. నదీ తీరం వెంట వున్న గ్రామాల రైతులకు సాగు నీరు కష్టాలు తొలగాయి. అలాగే మండలంలో ప్రజలు ఇక తాగు నీటికి ఇబ్బందులు పడవలసిన అవసరం లేదు. సమృద్ధిగా సాగు నీరు పంటకు అందుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నదీ తీరం వెంట వున్న గ్రామాల కొంత మంది రైతులు వరి, మిరప పంటలు విస్తారంగా సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.


హరివరం గ్రామ సమీపంలో మిరప నాట్లు వేస్తున్న కూలీలు,


పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

చాగలమర్రిలో 36.8 మి.మీల వర్షపాతం


బ్రాహ్మణపల్లె- కలుగోట్లపల్లె మధ్య వంతెనపై పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు


జాతీయ రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నపై ప్లాస్టిక్ పట్టలు కప్పిన దృశ్యం

చాగలమర్రి : చాగలమర్రి మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం 36.8 మి.మీగా నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. వరుణదేవుడు కరుణించి గత రెండు రోజులుగా మండలంలో ఒక మోస్తరు నుంచి భారీగా వర్షం కురవడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ప్రాణం పోసుకున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగోట్లపల్లె గ్రామానికి వెళ్లే రహదారుల్లో వక్కిలేరు వాగు వంతేనలపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామాలకు చెందిన రైతులు చాగలమర్రికి రావడానికి ఇబ్బందులకు పడాల్సి వచ్చింది. అయితే కమర్షియల్ మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు పంట చేతికంది వచ్చిన సమయంలో వర్షం రావడంతో ఆందోళన కలిగించింది. కొంతమంది రైతులు మినుము పంటను కోసి పోలంలోనే కుప్పగా పోసి ప్లాస్టిక్ పట్టలు కప్పి ఉంచుకున్నారు.


నంద్యాల శ్రమదానం బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న చామకాల్వ

ఉధృతంగా పాలేరువాగు

నంద్యాల(అర్బన్): గత రెండు రోజులుగా మహానంది పరిసర ప్రాంతాల్లోని నల్లమల కొండల్లో కురుస్తున్న వర్షాలకు పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొండల ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల నీరు ఆదివారం పాలేరు వాగులో కలిశాయి. పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల సమీపంలో పాలేరు వాగు నీరు చామకాల్వలో కలుస్తాయి. పట్టణ నడిబొడ్డు నుంచి వెళ్లే చామకాల్వ ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించడంతో పట్టణ వాసులు ఆశ్చర్యానికి గురయ్యారు.

నేడు 'స్పందన'

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కింద వున్న గ్రామాలకు ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ స్పష్టం చేశారు.

ముఖ్తార్‌బాషాకు నివాళి

నంద్యాల(న్యూటౌన్): కమ్యూనిస్టు యోధుడు ముఖ్తార్‌బాషా మూడో వర్ధంతిని ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విప్లవ భావాలకు ఆకర్షితుడై పీడీఎస్‌యూ సంఘానికి బాధ్యత వహిస్తూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రఫీ, ఖాజామియా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.